పత్తికే రైతుల మొగ్గు

- మరికల్‌లో 17వేల ఎకరాల సాగు అంచన
- వర్షాలకు ముందే విత్తనాలు నాటుతున్న రైతులు



మరికల్‌లో పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

మండలంలో సాగు అంచన..

పంట	ఎకరాల్లో
పత్తి	17వేలు
ఆముధం	125
కంది	670
వరి	13,450

మరికల్: అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తి మంచి ధరలు పలకడంతో ఈ ఏడాది అధిక శాతం రైతులు పత్తి వైపు మొగ్గు చూపుతున్నారు. రెండేళ్ల నుంచి పత్తి క్వింటాల్ రూ.6 వేల నుంచి రూ.10 వేల మధ్యన ధర పలకడంతో మండలంలో పత్తి సాగు చేసే రైతుల సంఖ్య పెరుగుతుంది. ఇప్పటికే రైతులు తమ పొలాలను చదును చేసి విత్తనాలు నాటేందుకు సిద్ధం చేశారు. ఇటీవల కురిసిన మోస్తరు వర్షాలకు సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. 2022లో 8,245 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, మార్కెట్‌లో పత్తికి రికార్డు స్థాయిలో రూ.15వేల మద్దతు ధర పలికింది. 2023లో కూడా అదే ధరలు ఉంటాయని ఆలోచనతో రైతులు 18,236 ఎకరాలో సాగు చేశారు. ధరలు మాత్రం క్వింటాల్‌కు రూ.8 వేలకు పడిపోయింది. ఈ సారి 17వేల ఎకరాలకు పైగా పత్తి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తే పత్తి పంటకు ఎలాంటి ఢోకా ఉండదు. వర్షాలు ముఖం చాటేస్తే నష్టం తీవ్రంగా ఉండే ప్రమాదం ఉంది.

రైతులు తొందర పడొద్దు

రుతు పవనాలు రాక ముందే రైతులు తొందరపడి విత్తనాలు నాటితే నష్టపోయే అవకాశం ఉంది. ఇప్పటికే రైతులకు కావాల్సిన పత్తి విత్తనాలను ఫర్టిలైజర్ దుకాణాల్లో అందుబాటులో ఉంచింది. పది రోజుల తర్వాత వచ్చే రుతు పవనాలను చూసి విత్తనాలు నాటాలి.

– శివకుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి, మరికల్

వర్షం వస్తుందని నమ్మకంతో..

వర్షం వస్తుందని నమ్మకంతో రైతులు మండుటెండలను సైతం లెక్క చేయకుండా పొలాల్లో పత్తి విత్తనాలు నాటుతున్నారు. ఇప్పటికే మండలంలో 25 శాతం రైతులు విత్తనాలు నాటారు. వర్షాలు లేక విత్తనాలు మొలకెత్తక నష్టపోతున్నారు. విత్తనాలు నాటే సమయం దాటితే దిగుబడి తగ్గుందనే ఆలోచనతో రైతులు ముందుకు వెళ్తున్నారు. రాష్ట్రంలో రుతు పవనాలు వస్తున్నట్లు వాతావరణ శాఖ తెలుపుతుంది.

సైనిక శిక్షణ పూర్తిచేసుకున్న కుమారుడికి తల్లి సెల్యూట్



తల్లికి సెల్యూట్ చేస్తున్న తార శేఖర్

కృష్ణా: తమకు అక్షరజ్ఞానం లేకున్నా తమ కుమారుడిని కష్టపడి చదివించారు ఆ తల్లిదండ్రులు. అంతేకాదు.. తాము మారుమూల పల్లెలో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నా తమ కుమారుడిని మాత్రం దేశ సేవ కోసం సైన్యంలో చేరేందుకు ప్రేరేపించారు. వారి కష్టాన్ని వృథా చేయక దేశ రక్షణే ధ్యేయంగా అడుగులు వేసిన వారి కుమారుడు అగ్నివీర్‌కి ఎంపికయ్యాడు. శిక్షణ సైతం పూర్తి చేసుకునే రోజు రాగా.. ఆ సమయంలో ఆ తల్లిదండ్రులు అక్కడే ఉండడం, కుమారుడు సంతోషంతో తల్లిని గౌరవిస్తూ సెల్యూట్ చేయగా.. ఆ దృశ్యాలు చూసిన పలువురు హర్షం వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కృష్ణా మండలంలోని గుడెబల్లూర్ చెందిన తార శేఖర్ ఇటీవల సైనిక శిక్షణ పూర్తి చేసుకొని సోమవారం మహారాష్ట్రలోని నాసిక్‌లో పాసింగ్ అవుట్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆ యువకుడి తల్లిదండ్రులు కాకి పార్వతమ్మ, తాయప్ప పాల్గొన్నారు. ఆ యువకుడు తల్లిని గౌరవిస్తూ సెల్యూట్ చేయడంతో అక్కడి అధికారులు వారిని అభినందించారు. ఈ యువకుడిని ఆదర్శంగా తీసుకుని యువత సమయం వృథా చేయకుండా దేశానికి ఉపయోగపడేలా కృషి చేయాలని పలువురు సూచించారు.

ముగిసిన వేసవి క్రీడా శిబిరం



మాట్లాడుతున్న సంగ నర్సింహులు

నారాయణపేట రూరల్: జిల్లా క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్థానిక మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ముగిసింది. సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశానికి టీవీ రేడియో గాయకుడు సంగ నర్సింహులు హాజరై మాట్లాడారు. నెల రోజుల పాటు సమయాన్ని వృథా చేయకుండా అథ్లెటిక్స్, ఫుట్‌బాల్ క్రీడలను నేర్చుకోవడం పై అభినందించారు. నిత్యం ఆటలు ఆడటం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఉన్నత చదువులో సీట్లు, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్లు లభిస్తాయని చెప్పారు. అనంతరం చిన్నారులకు ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో రమణ, శ్రీలత, వెంకటప్ప, కనకప్ప, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఇళ్లమధ్య నిలిచిన వర్షపునీరు



మక్తల్‌లో బస్టాండ్ వద్ద నిలిచిన వర్షపునీరు

మక్తల్: పట్టణంలో బసవేశ్వర కాలనీ, యల్లమ్మకుంట వీధిలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి డ్రెయినేజీలు లేకపోవడంతో ఇళ్ల మధ్యన నీరు నిలిచింది. గుంతలు అధికంగా ఉండటంతో చిన్నపాటి వర్షానికి గుంతలో నిలిచిపోతున్నాయి. అధికారులకు సమస్య తెలిపినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు తెలిపారు. కాగా కురిసిన వర్షానికి ఖరీఫ్ విత్తనాలు వేసేందుకు అనుకూలంగా మారింది. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు.

చెరువును తలపిస్తున్న ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం

మాగనూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి చెరువులా దర్శనమిస్తుంది. పాఠశాలకు సెలవులు ఉండటంతో ఎలాంటి ఇబ్బంది తలెత్తలేదు. వర్షాకాలం రానుండటంతో జూన్12న పాఠశాల పున:ప్రారంభం అవుతున్న నేపథ్యంలో వర్షపు నీటితో విద్యార్థులకు ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు ఉన్నాయని, పంచాయతీ అధికారులు స్పందించి వర్షపు నీటిని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చెరువును తలపిస్తున్న మాగనూరు పాఠశాల ప్రాంగణం

ఏకకాలంలో పంట రుణమాఫీ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆత్మకూర్: రైతుల పంట రుణమాఫీ రూ.2 లక్షలు ఏకకాలంలో చేయాలని.. అన్నిరకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఉచితంగా పంపిణీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. దళిత, గిరిజన, సన్నకారు రైతులకు ఉచితంగా, మిగిలిన వారికి 50 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలు, మినీ ట్రాక్టర్లు ఇవ్వాలని అందించాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ వ్యవసాయరంగానికి తూట్లు పొడుస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.500 పంట బోనస్‌తో పాటు పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. అనంతరం డిమాండ్ల వినతిపత్రాన్ని ఆర్‌ఐ జయమ్మకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటన్న, వాసారెడ్డి, ప్రసాద్, నాగేష్, వెంకటయ్య, నారాయణ్‌రెడ్డి, హన్మంతు, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కుఅందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో ప్రమాదవశాత్తు చెరువలో పడి మృతి చెందిన బుచ్చయ్య కుటుంబసభ్యులకు సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ప్రమాదబీమాకు చెందిన రూ.2లక్షల చెక్కు అందజేశారు. పార్టీలో ఉన్న కార్యకర్త మృతి చెందడంతో పాటు, కుటుంబానికి తీరని లోటని తెలిపారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, గండిరాజ్, బాలయ్య, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

అధ్వానంగా బైరంపల్లి రోడ్డు



గుంతలమయంగా ఉన్న బైరంపల్లి రోడ్డు

మాగనూర్: మండలంలోని ఉజ్జెల్లి నుంచి బైరంపల్లి వరకు ఉన్న మట్టి రోడ్డు గుంతలు, కంప చెట్లతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దాదాపుగా మూడు కిలోమీటర్ల రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు సైక్లింగ్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న పీఈటీలు

మక్తల్: సైకిల్ దినోత్సవం సందర్భంగా పట్టణంలో విద్యార్థులకు సైక్లింగ్ పోటీలను సోమవారం నిర్వహించారు. మినీస్టేడియం నుంచి పురవీధుల గుండా 30 మంది బాలబాలికలు ఇందులో పాల్గొన్నారు. పోటీలను నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సైక్లింగ్ చేయడంతో విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని పీఈటీలు అంబ్రేస్, రూప తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ఆత్మకూర్: ద్విచక్రవాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఓవ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్తకోటకు చెందిన యాదయ్య తన ద్విచక్ర వాహనంపై ఆత్మకూర్‌కు వచ్చిన కొత్తకోటకు తిరుగు ప్రయాణమయ్యాడు. సాయంత్రం 5 గంటల సమయంలో బాలకిష్టాపూర్ సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయాన్ని గమనించిన ప్రయాణికులు 108కు సమాచారం అందించి ఆత్మకూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్‌ఐ రోషయ్య తెలిపారు.

అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీటీమ్

నారాయణపేట రూరల్: అమ్మాయిలను వేధిస్తే కఠిన శిక్షలు తప్పవని ఏఎస్‌ఐ శ్రీదేవి అన్నారు. షీటీమ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షలకు హాజరైన అభ్యర్థులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు అత్యవసర సమయంలో తమ రక్షణకు షీ టీమ్స్ ఉంటాయనే విషయంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పని ప్రదేశాల్లో మహిళలు, బాలికలతో ఎవరైన ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడితే వెంటనే 100, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 8712670398కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాలను అరికట్టడానికి సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని, అమ్మాయిలకు గుడ్, బ్యాడ్ టచ్ గురించి తెలిసి ఉండాలన్నారు. అమ్మాయిలతో పాటు మగ పిల్లల్లోను మార్పు రావాలన్నారు. కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలరాజు, నమీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్



మక్తల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అంద జేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



కొత్తపల్లిలో..

మక్తల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం పడమటి అంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలు చేయకపోవడం, రుణమాఫీ సమస్యలు పరిష్కారం చేయడం లేదన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవిన్‌కుమార్‌రెడ్డి గెలుపొందారని, బీఆర్‌ఎస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉందని అన్నారు. కార్యక్రమంలో నర్సింహాగౌడ్, చిన్నహన్మంతు, మొగులప్ప, అన్వర్, శంకర నర్సింహారెడ్డి, వెంకటయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: కొత్తపల్లి మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది ముగింపు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పదేళ్ల కాలంలో కేసీఆరధ్వాధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో మదుసుధన్‌రెడ్డి, రాంరెడ్డి, శివరాజ్, మాణిక్యప్ప, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమంటున్న కూరగాయల ధరలు



మండల కేంద్రంలో కూరగాయలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

మరికల్: మార్కెట్‌లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. జిల్లాలో కూరగాయల సాగు ఏటేటా తగ్గిపోవడంతో పండించే కూరగాయలు జిల్లా ప్రజల అవసరాలకు సరిపోక పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ధరలు ఆకాశనంటుతున్నాయి. బీరకాయ, టమాట, బెండ, క్యాప్సికం, వంకాయలు, పచ్చిమిర్చి కిలో రూ. 60 నుంచి రూ.వందకు చేరుకున్నాయి. రెండేళ్ల క్రితం రూ. 200 తీసుకెళ్తే బస్తా నిండా కూరగాయలు, ప్రస్తుతం రూ.500 తీసుకెళ్లిన రావడం లేదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ పంటలు సాగు చేస్తున్న రైతులు, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కూరగాయలు పండించాలని ఉద్యానవనశాఖ అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ఏళ్లుగా పాత భవనంలోనే గ్రంథాలయం



మరికల్‌లో పాత పంచాయతీలో కొనసాగుతున్న గ్రంథాలయం

మరికల్: విద్యార్థుల, యువత మేథశక్తిని పెంచుకునేందుకు ఏర్పాటు చేసిన గ్రంథాలయాల నిర్వహణ గాడి తప్పుతుంది. ఏళ్లుగా పాత భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కొత్త పుస్తకాల ఊసేలేదు. పోటీ పరీక్షల సమయంలో పేద విద్యార్థులకు సరైన పుస్తకాలు దొరకడం లేదు. చాలా చోట్ల గ్రంథపాలకులు లేక అటెండర్లే పెద్ద దిక్కుగా ఉంటూ వాటిని నడిపిస్తున్నారు. పట్టణాలు, పల్లెల్లో విజ్ఞానకాంతులు పూయించడానికి ఏర్పాటు చేసిన గ్రంథాలయాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. చాలా చోట్ల పక్కా భవనాలు లేక ఉన్నచోట శిథిలావస్థకు చేరాయి. ఉచితంగా విజ్ఞానం పంచుతున్నా వాటి అభివృద్ధికి సమస్యలు ఎదురవుతున్నాయి. నియోజకవర్గంలో ఏ మండలంలో చూసినా గ్రంథాలయాల నిర్వహణ అధ్వానంగా మారాయి. కొన్ని అద్దె భవనాల్లో మరికొన్ని మండల్లాలోని పురాతన భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఏళ్లుగా మారని ఈ విజ్ఞాన కేంద్రాలకు పాఠకులు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి గ్రంథాలయలకు పూర్వ వైభవం తీసుకరావడం కోసం చర్యలు తీసుకోవాలని పాఠకులు కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

పాన్‌గల్: నకిలీ విత్తనాలు విక్రయించిన, రైతులను మోసగించిన ఫర్టిలైజర్ దుకాణాల యజమానులపై కఠిన చర్యలు తప్పవని మండల టాస్క్‌ఫోర్స్ బృందం హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం దుకాణంలోని వరి విత్తనాల్లో ఉండే నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా జన్యుపరమైన మంచి విత్తన రకాలను పరిశీలించారు. దుకాణంలోని రికార్డులు, విత్తనాల పాకెట్లను పరిశీలించినట్లు వారు పేర్కొన్నారు. కొనుగోలు సమయంలో రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. మండల టాస్క్‌ఫోర్స్ బృందం ఇన్‌చార్జీ ఏఓ మల్లయ్య, డీటీ అశోక్‌నాయుడు, హెడ్ కానిస్టేబుల్ రోశయ్య పాల్గొన్నారు.

పెబేరు రూరల్: శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ఫర్టిలేజర్ షాపుల్లో వ్యవసాయ అధికారి చంద్రమౌళి స్థానిక పోలీసులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లో గల విత్తనాల పాకెట్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సరిపడా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే రైతులు ప్రభుత్వం గుర్తింపు పొందిన షాపుల్లోనే కొనుగోలు చేయాలని సూచించారు. విత్తనాలు లూజుగా కొనుగోలు చేయొద్దన్నారు. నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, లేని పక్షంలో చట్టపరంగా చర్యలు తీసుకుంటామని దుకాణ యజమానులకు హెచ్చరించారు.



పాన్‌గల్‌లో విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

క్లుప్తంగా

యూనిఫాంలు సకాలంలో అందించాలి



ఊట్కూరు: విద్యార్థుల యూనిఫాం కుట్టుటను సకాలంలో పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ జ్యోతి సూచించారు. సోమవారం మహిళా సమైక్య ఆధ్వర్యంలో విద్యార్థుల యూనిఫాం తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. తయారీ గురించి మహిళా టైలర్లను అడిగి తెలుసుకున్నారు. ఊట్కూరు, బిజ్వార్, పులిమామిడి, వల్లంపల్లి కేంద్రాలలో విద్యార్థుల యూనిఫాం తయారవుతున్నట్లు ఏపీఎం నిర్మల తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పూజలు

నారాయణపేట రూరల్: మండలంలోని బైరంకొండ శివాలయంలో బీజేపీ నాయకులు సోమవారంప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో పాలమూరులో డీకే అరుణ గెలవాలని, ఢిల్లీలో మోదీ హ్యాట్రిక్ ప్రధాని కావాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయి బన్ని, రామకృష్ణ, భీంషప్ప, వెంకటప్ప, బాలప్ప, ఊషప్ప పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని వినతి



నారాయణపేట: పెండింగ్‌లో ఉన్న డెలివరీ, డెత్, మ్యారేజ్ గిఫ్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న భవన నిర్మాణం కార్మికులకు డబ్బులు వెంటనే మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఏఓ నర్సింగ్‌రావుకు తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు నరసింహ మాట్లాడుతూ కార్మికులకు సంక్షేమ పథకం ద్వారా వచ్చే డబ్బుల కోసం దరఖాస్తు చేసుకుని మూడు, నాలుగు సంవత్సరాలు గడుస్తున్న అధికారులు డబ్బులు మంజూరు చేయకుండా లేబర్ ఆఫీస్ చుట్టూ తిప్పుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దరఖాస్తు చేసుకున్నప్పుడు విచారణ చేసి ఏఎల్‌ఓ దరఖాస్తు తీసుకుని, అప్లికేషన్ పైకి పంపుతామని చెప్పి సంవత్సరం గడిచిన తర్వాత డీసీఎల్ మళ్లీ విచారణ చేయడం సరైంది కాదన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికునికి డబ్బులు వెంటనే మంజూరు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెన్నప్ప, బాలరాజ్, అశోక్, పద్మమ్మ, రాజు, శ్రీను, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు సరిపడా బస్సులు నడపండి

నారాయణపేట రూరల్: మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగిందని, అవసరానికి సరిపడేవిధంగా ఆర్టీసీ బస్సులను నడిపించాలని పలువురు కోరారు. సోమవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 14 ఫిర్యాదులు వచ్చాయి. డిపో మేనేజర్ లక్ష్మీసుధ వారి సమస్యలను తెలుసుకున్నారు. ఏడీసీ ఆంజనేయులు వాటిని నమోదు చేసుకున్నారు. ముఖ్యంగా కోస్గి – మహబూబ్‌నగర్, నారాయణపేట – యానగుంది, కోటకొండ – భూనేడ్, మక్తల్ – మహబూబ్‌నగర్ రూట్లో బస్సు ట్రిప్పుల సంఖ్య పెంచాలని కోరారు. భూనేడ్, గత్ప గ్రామాల నైట్ సర్వీసులను పునరుద్ధరించాలని, పులిమామిడి మీదుగా హైదరాబాద్, యాంకి నుంచి ఆత్మకూర్, కోస్గి నుంచి ఈర్లపల్లి మీదుగా దౌల్తాబాద్ బస్సు నడిపించాలని కోరారు. అదేవిధంగా కోటకొండ, బైరంకొండ, బోయిన్‌పల్లి రూట్లలో పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సమయానికి సరిపడ స్కూల్ బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవ పూజలు



అమరచింత: పట్టణంలోని జములమ్మ దేవత ఆలయ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయంలో జములమ్మ దేవత మూర్తి విగ్రహ ప్రతిష్ట జరిగి పదేళ్ల పూర్తి చేసుకోవడంతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు మంగలి నరసింహులు మాట్లాడుతూ ఆలయ నిర్వహణకు పట్టణ ప్రజల సహకారంతో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. అమ్మవారి దీవెనలతో ఆలయాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.